క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులలో భాగంగా కొత్త లైన్లు వేస్తున్న కారణంగా రెడ్డిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, కావున విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

బాల్యవివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న సోషల్ వర్కర్ బాలకాశమ్మ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): బాల్య వివాహాలను అరికట్టాలని సోషల్ వర్కర్ బాలకాశమ్మ కోరారు. శనివారం పి.తక్కెళ్లపాడు గ్రామంలో సార్డ్స్ ఆధ్వర్యంలో బాల్యవివాహల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, తల్లులు పాల్గొన్నారు.

హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.దునుమణి తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హిందీ సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాసై ఉండాలన్నారు. ఈ నెల 6వ తేదీన కళాశాలలో డెమోకు బయోడేటాతో పాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

స్మార్ట్ మీటర్లు ప్రజాధనం కొల్లగొట్టేందుకే..


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజల సంపద కొల్లగొట్టి అదానీకి అప్పగించేందుకే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజల మీద మోయలేని భారం వేస్తున్నారన్నారు. సామాన్య ప్రజల నడ్డివిరగ్గొడుతున్నారని మండిపడ్డారు. ప్రజల మీద విద్యుత్ భారం వేసేది లేదని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పారని విమర్శించారు. గతంలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కనీసం 15 రోజుల సమయం ఉండేదని, స్మార్ట్ మీటర్ల వలన రీచార్జి అయిపోయిన వెంటనే కరెంటు దానికదే కట్ అవుతుందని అన్నారు. ఇది ప్రజలకు పెనుభారంగా మారుతుందన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుభ పరిపాలనలో తొలి అడుగు అంటూ ఎమ్మెల్యేలు ఇంటింటికి తిరుగుతున్నారని, ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా ప్రజాప్రతినిధులను నిలదీస్తామని చెప్పారు. ప్రజలు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఆర్.మోహన్, ఏఐఎఫ్టీయూ నాయకులు ఎంఎస్ సాయి, రైతు కూలీ సంఘ నాయకులు లలిత కుమారి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి

చీమకుర్తి: పట్టణంలోని 1500 మంది పేదలకు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. దాంతో పాటు బాషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.25 వేల నగదును షేక్ ఖాదర్‌బాషాకు అందించారు. వెంకారెడ్డి తండ్రి మారం పేరిరెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత మారం పేరిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారం వెంకారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన తల్లిదండ్రుల జయంతి, వర్ధంతులను పురస్కరించుకుని మారం వెంకారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ మారం వెంకారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో మారం వెంకట సుబ్బారెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, పేరం శ్రీనివాసరావు, చింతకింది అశోక్, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మేడగం బ్రహ్మరెడ్డి, బడే దశరథరామిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొర్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం అర్చకుడు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు చేశారు. తొలుత అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నాణ్యమైన ఫర్నిచర్ అందించడమే లక్ష్యం


విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ సుబ్రహ్మణ్యం

ఒంగోలు టౌన్: నాణ్యమైన ఫర్నిచర్ అందించడమే లక్ష్యంగా ఒంగోలు నగరంలో రాయల్‌ఓక్ ఫర్నిచర్ స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ విజయ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక సుజాత నగర్‌లోని పద్మ టవర్స్ పక్కన శనివారం రాయల్ ఓక్ ఫర్నిచర్ స్టోర్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంట్లోని లివింగ్ రూం, బెడ్ రూం, డైనింగ్ హాల్‌తో పాటు ఆఫీసు, అవుట్ డోర్‌లకు అవసరమైన దేశీయ, విదేశీ నాణ్యమైన ఫర్నిచర్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కస్టమర్లకు అవసరమైన సేవలను 24 గంటలూ అందిస్తామని చెప్పారు. స్టోర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కస్టమర్లకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మదన్ సుబ్రహ్మణ్యం, ఫ్రాంచైజీ హెడ్ కిరణ్ చబారియా, వీఎం అండ్ ఎన్ఎస్‌ఓ హెడ్ తమ్మయ్య కొటేరా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హెడ్ కేపీ వినోద్, ఫ్రాంచైజీ యజమానులు నాని, మోనికా తదితరులు పాల్గొన్నారు.

జడ కత్తిరింపుపై సమగ్ర విచారణ చేపట్టాలి


హాస్టల్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక జడను కత్తిరించటంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్, సహాయక కార్యదర్శి జీ దేవరాజు డిమాండ్ చేశారు. బాలిక జడను గుర్తు తెలియని వారు కత్తిరించటంతో శనివారం చీమకుర్తిలోని బాలికల హాస్టల్‌ను సందర్శించారు. బాలికను పరామర్శించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ హాస్టల్ సిబ్బంది పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉందన్నారు. హాస్టల్ వార్డెన్ స్థానికంగా నివాసం ఉండి బాలికల సంరక్షణ బాధ్యతలు చూసుకోవాలన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని బాలికలకు మౌలిక వసతులతో పాటు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

చీమకుర్తి రూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఇవాంజలిన్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని మంచికలపాడు, మర్రిచెట్లపాలెం, రామచంద్రాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఇవాంజలిన్ పాల్గొని బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించడం శ్రేయస్కరమని, తద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, నాగలక్ష్మి, దేవసేన, అంగన్‌వాడీ టీచర్లు అనూరాధ, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినులకు గాయాలు

దొనకొండ: ద్విచక్ర వాహనాన్ని పందులు ఢీకొనటంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం దొనకొండ ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదుట శనివారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. దొనకొండకు చెందిన సీతిరాల రామయ్య కుమార్తె రుచిత దర్శిలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతోంది. రోజూ దొనకొండ నుంచి కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుంది. ఆ క్రమంలో స్నేహితురాలు పైనికను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని దర్శి నుంచి దొనకొండ వస్తున్నారు. పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి పందులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాయి. రుచిత, పైనికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలించారు.

వంతెనలు లేక ఇబ్బందులు

- అవస్థలు పడుతున్న చెర్లోపల్లి, గంటవానిపల్లె వాసులు
- తీగలేరు పొంగితే పలు ప్రాంతాలకు రాక పోకలు బంద్
- గతంలో దొంగలవాగు పొంగి ఓ యువకుడు గల్లంతు


తీగలేరు పొంగడంతో ఒడ్డునే నిలిచిన గంటవానిపల్లె వాసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాలకు వంతెనలు లేక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమయంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోవటంతో పాటు మరికొన్ని ముఖ్య ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. మండల పరిధిలోని తీగలేరు పొంగి ప్రవహించడంతో ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె గ్రామాలకు వెళ్లే మార్గం లేక గ్రామస్తులు అగచాట్లు పడుతున్నారు. గతంలో ఆయా వంతెనల స్థానంలో అధునాతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించినా నేటికీ ఆయా వంతెనల పనులు ప్రారంభానికి నోచుకోకపోవం శోచనీయం. ఏటా వర్షాకాల సమయంలో మండల పరిధిలోని తీగలేరు వాగు పొంగి ప్రవహిస్తుండటంతో మండల పరిధిలోని చిన్నదోర్నాల కల్వర్టు వద్ద వరద వస్తుంది. అప్పుడు ఆ మార్గంలో మార్కాపురం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతితో పాటు గిద్దలూరు, కడప, పోరుమామిళ్ల తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో బస్సులు ఆ మార్గంలో కాకుండా కుంట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతేడాది తీగలేరు వాగు పొంగి ప్రవహించడంతో మూడు రోజుల పాటు గంటవానిపల్లె, ఎగువ చెర్లోపల్లి గ్రామాలకు రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరద తీవ్రతకు చిన్నదోర్నాల వద్ద కల్వర్టు, గంటవానిపల్లె చప్టాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయా ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలించారు. దీంతో అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారే తప్ప శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారు. దీంతో పాటు కర్నూల్ రోడ్డులో ఉన్న దొంగలవాగు పొంగి ప్రవహించటంతో కొత్తూరు వద్ద వెలుగొండ సొరంగ నిర్మాణ ప్రాంతంలో కర్నూల్ రోడ్డుపై ఉన్న నేలబారు చప్టాపై ఎన్నో మార్లు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు గతంలో ఎగువ చర్లోపల్లికి చెందిన ఓ యువకుడు వరద తీవ్రతకు గల్లంతై ప్రాణాలు కోల్పోయాడు. ఎన్నో ఏళ్లుగా వాగులు పొంగుతున్నా పట్టించుకున్న నాథుడే లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేలబారు చప్టాల స్థానంలో వంతెనలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


రేగడపల్లిలో దర్శనమిస్తున్న శ్రీవారు

కొనకనమిట్ల: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మి అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం


డ్రైవర్ డోర్‌నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులు

మార్కాపురం టౌన్: మార్కాపురం నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం చెరువుకట్టపై ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారులను తప్పించబోయి చెరువుకట్ట మీద నుంచి పొలాల్లోకి ఒరిగింది. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. ఎదురుగా వస్తున్న బైకులను తప్పించబోయి ఈ ఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సమయంలో బస్సులో సుమారు 40 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన గురవయ్య

దొనకొండ: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన చెన్నుబోయిన గురవయ్య బజారుకు వచ్చి పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. దొనకొండ నుంచి కుంట వైపు ఓ లారీ ఇసుక లోడుతో వెళ్తోంది. స్పీడు బ్రేకర్ వద్ద లారీ డోర్ ఊడి గురవయ్యకు బలంగా తగిలింది. లారీ వెనుక టైర్ల కింద గురవయ్య రెండు కాళ్లు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వచ్చి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభ


పుల్లలచెరువు: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్ద దోర్నాలలో ఆదివారం జరిగే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీశైలం రహదారిలోని మల్లికార్జున ఎస్టేట్స్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం నియోజకవర్గ శాసన సభ్యుడు తాడిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు భారీగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

6న పుల్లలచెరువులో..

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో ఈ నెల 6వ తేదీన జరిగే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్‌లు సత్యనారాయణ రెడ్డి, కోటిరెడ్డి, రవణరెడ్డి, యోహాను, రాష్ట్ర పంచాయతీరాజ్ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకి రఘు, నాయకులు కోటిరెడ్డి, దినేష్ యాదవ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఖాశిం, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఆనందరావు పాల్గొన్నారు.